వేతన వెతలు..!


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

- సకాలంలో అందని ఉపాధి వేతనాలు
- విడుదలవ్వని నిధులు
- లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు

హిరమండలం: గ్రామాల్లో వలసలు నివారించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు అవస్థలు పడుతున్నారు. మండలంలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన రూ.1.80 కోట్లకు పైగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. రోజువారీ మస్టర్లు వేస్తూ బిల్లులు కంప్యూటర్‌లో జనరేట్ చేస్తున్నా, డబ్బులు మాత్రం కూలీల ఖాతాల్లో పడడం లేదు. దీంతో లబ్ధిదారులు రోజువారీ అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్లు, డ్రైనేజీలు, గోకులాల నిర్మాణ పనులు జరిగాయి. కానీ వాటి బకాయిలు కూడా ఆర్థిక సంవత్సరం ముగిసినా ఇంకా విడుదల చేయలేదు.

నిలువ నీడకరువు

మండలంలోని పలుచోట్ల ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు ఎండల్లో ఇబ్బంది పడుతున్నారు. పనిచేసే చోట నీడకోసం ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో మండుటెండలో విలవిలలాడుతున్నారు. పని ప్రదేశాల్లో కనీసం టెంట్లు కూడా లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఉపాధి పనులు చేపడుతుంటారు. అయితే ఆ సమయంలో నీడ లేకపోవడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మరికొన్ని చోట్ల తాగడానికి మంచినీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. అదేవిధంగా కనీసం ఫస్ట్ ఎయిడ్ కిట్లు కూడా లేవని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కూలీల ఆరోగ్య భద్రతపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోషణ కష్టంగా ఉంది



ఉపాధి పనులకు వెళ్తే గతంలో ప్రతీవారం డబ్బులు వచ్చేవి. దీంతో సాఫీగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాళ్లం. అయితే ఇప్పుడు బిల్లులు రాకపోవడంతో రోజురోజుకూ కుటుంబ పోషణ చాలా కష్టంగా మారుతోంది. దాదాపు రెండు నెలలుగా వేతనాలు ఇవ్వలేదు. వడ్డీకి డబ్బులు తెచ్చుకుని రోజువారీ అవసరాలు తీర్చుకుంటున్నాం.

– ఎం.చిట్టమ్మ, గొట్టా గ్రామం, హిరమండలం

ఇబ్బందులు తప్పడం లేదు



ఉపాధి పనులకు వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పని ప్రదేశాల్లో కనీసం నీడకూడా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. తాగడానికి నీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. ఓఆర్ఎస్ ద్రావణాన్ని కూలీలకు ఇస్తే ఉపయుక్తంగా ఉంటుంది.

– ఐ.బాలమ్మ, గొట్టా గ్రామం, హిరమండలం

చర్యలు తీసుకుంటాం



ఉపాధి కూలీల వేతనాలు బకాయిలు ఉన్నమాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటాం. పని ప్రదేశంలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాట్లు చేస్తాం.

– ఎ.శ్రీనివాసరావు, ఏపీవో, హిరమండలం

మండలంలో వివరాలు	ఉపాధి జాబ్‌కార్డులు:	శ్రమశక్తి సంఘాలు:	మొత్తం కూలీల సంఖ్య:	ప్రస్తుతం పనిచేస్తున్నవారు:
	8,592	132	9,175 మంది	3,500 మంది

క్లుప్తంగా

సాంకేతిక పరిజ్ఞానం అవసరం


ల్యాప్‌టాప్‌తో పాఠశాల సిబ్బంది

జలుమూరు: విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానం అవసరమని స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఇప్పిలి వేణుగోపాలరావు సూచించారు. ఉత్తరాంధ్ర స్థాయిలో హ్యాకథాన్ ఫిర్కి ఆన్‌లైన్ వేదికగా ప్రతిభా పరీక్ష నిర్వహించగా జలుమూరు బాలికల ఉన్నత పాఠశాల ఆరో స్థానంలో నిలిచింది. దీంతో విద్యార్థులు కంప్యూటర్‌పై అవగాహన పెంచుకునేందుకు అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ సంస్థ ల్యాప్‌టాప్ అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

9 మందిపై బైండోవర్ కేసులు


వ్యాపారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ పాపారావు

మెళియాపుట్టి: మండలంలోని 9 మంది బెల్లం వర్తకులపై తహసీల్దార్ పాపారావు బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ షేక్ మీరాసాహెబ్ తెలిపారు. అధిక మొత్తంలో బెల్లం నిల్వలు ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చాపర, మెళియాపుట్టి గ్రామాలకు చెందిన 9 మంది వర్తకులు ప్రతీ 15 రోజులకు ఒకసారి విక్రయాలకు సంబంధించిన వివరాలు టెక్కలి ప్రొహిబిషన్ స్టేషన్‌కు తెలియజేయాలన్నారు. నాటుసారా తయారీకి పాల్పడుతున్న వారికి సహకరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పలువురు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నవధాన్యాల విత్తన ప్రదర్శన


నవధాన్యాల విత్తనాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట యూనిట్‌లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణిలు రైతుల సమక్షంలో నవధాన్యాల విత్తనాలను శుక్రవారం ప్రదర్శించారు. క్షేత్రస్థాయిలో రైతులకు నవధాన్యాల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సొంత క్షేత్రాల్లో 25 కేజీల నవధాన్య విత్తనాలను వేయిస్తున్నామని తెలిపారు. నవధాన్యాల సాగును ఒక ఉద్యమంగా రైతులతో చేయిస్తామని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పంటలకు చీడపీడలు దరిచేరవని, దిగుబడి సాధ్యపడుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా నైపుణ్యాలు అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బూర్జ: విద్యార్థులకు వృత్తి విద్యా నైపుణ్యాలు అవసరమని ఒకేషనల్ విద్య కన్సల్టెంట్ బి.రాజశేఖర్ అన్నారు. మండలంలోని ఓవీపేట ఏపీ మోడల్ స్కూల్‌లో వృత్తివిద్యపై ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. వేసవి సెలవులు పురస్కరించుకొని విద్యార్థులకు పది రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ సేవలు మరువలేనివి


కస్తూర్బా గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

హిరమండలం: దేశంలో బాలికా విద్యను ప్రోత్సహించిన కస్తూర్బా గాంధీ సేవలు మరువలేనివని స్థానిక కేజీబీవీ ప్రత్యేక అధికారి కృష్ణవేణి అన్నారు. శుక్రవారం ఆమె జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలో బాలికలపై వివక్షను నియంత్రించేందుకు ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరూ మోసపోవద్దు

మెళియాపుట్టి: మండలంలోని కొన్నిచోట్ల గుర్తు తెలియని వ్యక్తులు షాపుల యజమానుల వద్దకు వెళ్లి పోలీసుల పేరుచెప్పి డబ్బులు అడుగుతున్నారని, ఎవరూ మోసపోవద్దని ఎస్ఐ రమేష్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. గూగుల్‌లో షాపుల వివరాలు తెలుసుకుని డబ్బు అడుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివారు తారసపడితే సమాచారం ఇవ్వాలన్నారు.

బీఎల్‌వోలు సహకరించాలి


మాట్లాడుతున్న ఈఆర్‌వో లావణ్య

నరసన్నపేట: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణకు బీఎల్‌వోలు సహకరించాలని నరసన్నపేట ఈఆర్‌వో లావణ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నియోజకవర్గ పరిధిలోని బీఎల్‌వోలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో నికరమైన ఓటర్ల జాబితా ఉండాలన్నారు. మైగ్రేషన్, డబుల్ ఎంట్రీ, మరణించిన వారు పేర్లు తొలగించాలని స్పష్టం చేశారు. మరణించినవారు కాకుండా ఇతరుల పేర్లు తొలగించాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు వారికి ఆయా నోటీసులు ముందుగా జారీ చేయాలన్నారు. మైగ్రేట్ ఓటర్లను తొలగించే ముందు వారి అంగీకారం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై వివరాలు తెలియచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణ, డీటీ శరత్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అవసరాలకు వినియోగించాలి

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం నుంచి వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై పొందిన యంత్రాలను ఆయా ప్రాంతాల్లోని రైతుల అవసరాలకు వినియోగించాలని జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, ఎల్.ఎన్.పేట ఏవో పైడి లతశ్రీలు సూచించారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, యంబరాం తదితర గ్రామాల్లో గత ప్రభుత్వంలో పొందిన ట్రాక్టర్లతో పాటు ఇతర వ్యవసాయ యంత్రాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. రైతుల అవసరాలకు తక్కువ అద్దెకు వీటిని సరఫరా చేయాలన్నారు. ఆమెతో పాటు రైతు సంఘాల సభ్యులు, రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే


నరసన్నపేట: జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణ చైతన్య

సంఘ సంస్కర్త జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శనీయమని వక్తలు అన్నారు. ఆమదాలవలస, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల్లో పూలే జయంతి వేడుకలను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజ శ్రేయస్సుకు ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు.
– సాక్షి నెట్‌వర్క్


నరసన్నపేట: టీడీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం


నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో....


కొత్తూరు: బీజేపీ కార్యాలయంలో...


జలుమూరు ప్రాథమిక పాఠశాలలో...


సారవకోట: అవలింగి జేబీటీ పాఠశాలలో 199వ జయంతి పురస్కరించుకొని విద్యార్థుల నివాళి


పాతపట్నం: పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న మామిడి శ్రీకాంత్

ఈనెల 16న తల్లిదండ్రుల సమావేశం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 16వ తేదీన విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పి.లత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రానున్న విద్యా సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, కళాశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకోనున్నామన్నారు. నూతన ప్రవేశాలు, ఉత్తీర్ణత శాతం మెరుగునకు చేపట్టాల్సిన చర్యలపై మాట్లాడనున్నారు. అందువలన విద్యార్థుల తల్లిదండ్రులు హాజరవ్వాలని కోరారు.

విచారణ బృందాలు నియామకం

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో అక్రమంగా ఇళ్ల స్థలాలు పొందిన నిర్వాసితులపై విచారణ జరిపేందుకు బృందాలను నియమించినట్లు స్థానిక తహసీల్దార్ రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మెట్టూరు బిట్–1 ఆర్ఆర్ కాలనీలో 18 మంది ఇళ్ల స్థలాలు అక్రమంగా పొందినట్లు అదే కాలనీకి చెందిన బూర్లె శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీంతో పత్రికల్లో వచ్చిన వార్తలకు స్పందించి తహసీల్దార్ విచారణకు ఆదేశించారు.

పీడీఎస్ బియ్యం సీజ్

నరసన్నపేట: స్థానిక కలివరపుపేట గ్రామంలోని ఊణ్ణ వెంకటరమణ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 87 కేజీల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు సివిల్ సప్లయ్ డీటీ రామకృష్ణ తెలియజేశారు. గురువారం రాత్రి అందిన సమాచారం మేరకు ఇంట్లో తనిఖీలు చేపట్టగా 87 కేజీల బియ్యం గుర్తించి, ఎంఎల్ఎస్ గోడౌన్‌కు అప్పగించామని శుక్రవారం తెలిపారు. అక్రమంగా పీడీఎస్ బియ్యం అమ్మకాలు చేసినా, పరిధికి మించి కలిగి ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు.

గరిష్ట వేతనం అందేలా చర్యలు తీసుకోవాలి

పొందూరు: ఉపాధి వేతనదారులకు గరిష్ట వేతనం అందేలా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ పి.సుధాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుతం వేసవి అలవెన్సులు లేవని, పనుల వద్ద సౌకర్యాలను ఉపాధి కూలీలే కల్పించుకోవాలని సూచించారు. వేతనదారుల సంఖ్య విషయంలో పొందూరు మండలం వెనుకబడి ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మన్మథరావు, టీఏలు పాల్గొన్నారు.

విత్తనాలు తయారు చేసుకోవాలి


సిద్ధం చేసిన విత్తనాలతో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఎల్.ఎన్.పేట: రైతులే విత్తనాలు తయారు చేసుకోవడం వలన విత్తనాలు కోసం చేసే ఖర్చు తగ్గుతుందని ప్రకృతి వ్యవసాయం యూనిట్ ఇన్‌చార్జి బి.లలిత అన్నారు. మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీలతో కలిసి 30 రకాల విత్తనాలు సిద్ధం చేశారు. వచ్చే సీజన్‌లో అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయల పంటలు పండించేందుకు ఇప్పటినుంచే విత్తనాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగం



సరుబుజ్జిలి మండలంలోని పాలవలస గ్రామంలో నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. ఇక్కడ రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో దహనం చేసే సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడం వలన చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. అందువలన అధికారులు స్పందించి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- సరుబుజ్జిలి

కల్వర్టు బాగు చేయరూ..?



ఆమదాలవలస పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే డాబాలవారి వీధిలో మురుగు కాలువపై రహదారి మధ్యలో ఉన్న కల్వర్టు కూలిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయం మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

- ఆమదాలవలస

108 కలశాలతో పూజలు



సారవకోట మండలంలోని కోదడ్డపనస శ్రీస్వయంభూ అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారికి 108 కలశాలతో పూజలు నిర్వహించారు. నిజమాబాద్‌కు చెందిన గురుస్వామి బల్యాపల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో విస్సు పూజలు జరిపారు. స్వామివారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి గణపతి హోమం చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

- సారవకోట

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పాతపట్నం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాతపట్నం: పౌష్టికాహారం తీసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.అనూరాధ అన్నారు. మండలంలోని ఎ.ఎస్.కవిటి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నక్క మార్కేండేయరావు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కౌమార దశలో ఉన్న బాలికలకు పోషకాహారం ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ షణ్ముఖరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ప్రతి ఒక్కరూ పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని శ్యామలాపురం సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.జ్యోతిలక్ష్మి అన్నారు. శ్యామలాపురం అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో శుక్రవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. రికార్డుల నిర్వాహణపై అవగాహన కలిగించారు.

భూముల రీసర్వేతో శాశ్వత పరిష్కారం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు: భూముల రీసర్వేతో సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. మండలంలోని తలతరియా గ్రామంలో రీసర్వేపై అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. రైతులు వారి భూముల వివరాలు అధికారులకు అందించి సర్వేలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా కార్యాలయంలో నేరుగా సంప్రదించవచ్చునన్నారు. ర్యాలీలో మండల సర్వేయర్ నాగేశ్వరరావు, ఆర్ఐ కిరణ్, వీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన


రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మండలంలోని నవగుడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఎంఈవో కె.రాంబాబు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు పెరుగుతుండడం శుభ పరిణామమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చిన్నారులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతుండడాన్ని గుర్తించారు. ఈ విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

యంత్రాలు అందుబాటులో ఉంచాలి


వ్యవసాయ యంత్రాలు పరిశీలిస్తున్న ఏవో సురేష్ కుమార్ తదితరులు

జలుమూరు: క్లస్టర్ హైరింగ్ సెంటర్లలో రైతులకు వ్యవసాయ పరికరాలు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయ అధికారి కె.సురేష్ కుమార్ సూచించారు. మండలంలోని జోనంకి కమ్యూనిటీ హైరింగ్ కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఆయా రైతులకు యంత్రాలు, పనిముట్లు అద్దెకు ఇవ్వాలన్నారు. ఇతర కేంద్రాలు కూడా ఇవే నిబంధనలు పాటించాలన్నారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక పరిమళ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ వైద్యుల సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైనవారు వినియోగించుకోవాలని సూచించారు.